www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 24 సెప్టెంబరు 2025

5

పశ్చిమ గోదావరి

ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - పాలకోడేరు

మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో పాలకోడేరు సొసైటీ ముఖ్య కార్య నిర్వహణాధికారి పివిఎల్.నరసింహారాజు అధ్యక్షతన ఖరీఫ్ ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, తహాశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సంధ్య మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,989, కామన్ రకానికి రూ.2,369గా నిర్ణయించడం జరిగిందన్నారు. ఎంటియు 7029, 1318, పిఎల్‌ఏ 1100లను కామన్ రకాలుగా గుర్తించడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్మినట్లయితే రైతులు వేలిముద్ర వేసిన 48 గంటలలో ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో జమ అవుతుందన్నారు. ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు గోనె సంచులు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు.

పిజిఆర్‌ఎస్‌లో పింఛన్ల గోల..!

'ఏలూరు నగరంలోని అరుంధతీపేటకు చెందిన గుండు పద్మావతికి 54 ఏళ్లు. భర్త చనిపోవడంతో వితంతు పెన్షన్ కోసం ఎదురుచూస్తోంది. దీంతో సోమవారం కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్‌ఎస్‌కు వచ్చి పింఛన్ ఇప్పించాలని అధికారులకు విన్నవించుకుంది. ఆ దరఖాస్తును ఏలూరు కార్పొరేషన్ అధికారులకు అప్పగించారు. కొత్త పింఛన్లకు సంబంధించి మంజూరు లేకపోవడంతో ఆమెకు పింఛన్ ఎప్పటికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది'.

'టి. నరసాపురం మండలం గంగినీడిపాలేనికి చెందిన రామినేని రాణి అనే మహిళ తన భర్త గతేడాది జనవరిలో మరణించారని, ఇప్పటి వరకూ వితంతు పింఛన్ రాలేదని పిజిఆర్‌ఎస్‌లో అధికారుల వద్దకొచ్చి మొరపెట్టుకుంది. ఈ దరఖాస్తును సంబంధిత మండల పరిషత్ అధికారులు చూడాలని అధికారులు అప్పగించారు. కొత్తగా పింఛన్ల మంజూరు జరగకపోవడంతో ఆమెకు పింఛన్ ఇచ్చే పరిస్థితి కానరావడం లేదు'.



నడవలేని వృద్ధుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ

కూటమి అధికారంలో కొచ్చి 15 నెలలు గడిచే

రెండు జిల్లాల్లో పింఛన్ల కోసం వేలాది మంది ఎదురుచూపు

అర్హులు ప్రతి సోమవారం పిజిఆర్‌ఎస్‌కు క్యూ

నిర్భాగ్యుల గోడు పట్టించుకోని చంద్రబాబు సర్కార్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న పద్మావతి, రాణి మాత్రమే కాదు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్‌ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ)లో పింఛన్ కోసం అభాగ్యులంతా క్యూ కడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి నానావస్థలు పడుతూ ఏలూరు చేరుకుని పిజిఆర్‌ఎస్‌లో తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదని, పింఛన్ అందడం లేదని వితంతువులు, వికలాంగులు, వృద్ధులు ఇలా ఎంతోమంది అధికారుల వద్ద విలపిస్తున్న పరిస్థితి ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు వెయ్యి వరకూ గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయ పరిధిలో దాదాపు 50 మంది వరకూ కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. రెండు జిల్లాల్లో కొత్తగా పింఛన్ల కోసం ఎదురుచూసే వారి సంఖ్య దాదాపు 50 వేల వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. అర్హతుండి వేలాది మంది పింఛన్లు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పింఛన్ల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అర్హులకు పింఛన్లు ఎందుకు మంజూరు చేయడం లేదో అర్థం కావడం లేదు. అధికారంలోకొచ్చి 15 నెలలు గడిచినా కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం నోరుమెదపడం లేదు. పక్షవాతంతో మంచానికే పరిమితమైన ఎంతోమందికి పింఛన్ అందడం లేదు. దీంతో అలాంటి వారంతా వైద్య ఖర్చుల కోసం తల్లడిల్లిపోతున్నారు. సచివాలయాలకు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలూ రాలేదని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో తమగోడు చెప్పుకునేందుకు కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్‌ఎస్‌కు జనం పెద్దఎత్తున వస్తున్నారు. పిజిఆర్‌ఎస్‌కు వస్తున్న ఫిర్యాదుల్లో పింఛన్ల కోసం వస్తున్న నిర్భాగ్యులే ఎక్కువగా ఉంటున్నారు. పింఛన్ల కోసం వస్తున్న ఫిర్యాదులను ఏదోక అధికారికి అప్పగిస్తూ పిజిఆర్‌ఎస్‌లో అధికారులు రాస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. ఇదంతా కంటితుడుపు చర్యగా మారిపోయింది. ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేయకుండా వారికి పింఛన్ ఏవిధంగా వస్తుందో చెప్పాల్సి ఉంది.

పింఛన్ల సంఖ్య తగ్గించాకే కొత్త పింఛన్లు ఇస్తారా..?

ఉన్న పింఛన్ల సంఖ్యను తగ్గించిన తర్వాత కొత్త పింఛన్లు మంజూరు చేసే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే ఏలూరు జిల్లాలో 4,300 మంది వికలాంగులు, పశ్చిమలో 1817 మంది వికలాంగుల పింఛన్లను తొలగించేందుకు నోటీసులు జారీ చేశారు. వికలాంగులతోపాటు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నుంచి తీవ్ర ప్రతిఘటన రావడంతో ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గింది. ఇప్పట్లో కొత్త పింఛన్లు ఇస్తుందో, లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

గిరిజనులపై నిర్బంధం అన్యాయం

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

గిరిజనులపై ప్రభుత్వ నిర్బంధం అన్యాయమని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన బుధవారం నిరసన చేపట్టారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామాల్లో ర్యాలీ చేపట్టిన గిరిజనులపై పోలీసు నిర్బంధాన్ని ఖండిస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు మాట్లాడారు. పచ్చని పొలాలు, సారవంతమైన భూములు వేలాది మందికి ఉపాధినిస్తున్న భూములను ఆయుధ డిపోకు కేటాయించడం తగదని, దీనివల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ గ్రామసభ, పీసా కమిటీ వ్యతిరేకించినా ప్రభుత్వం ఆయుధ డిపో పెట్టి తీరతామని ప్రకటించడం దారుణమన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన గిరిజనులు, వారికి అండగా ఉన్న సిపిఎం నాయకులపై పోలీసులు దౌర్జన్యం చేయడం అప్రజాస్వామికమని తెలిపారు. లేనిపక్షంలో గిరిజనులు, ప్రజల పోరాటాలకు పూర్తి మద్దతు ప్రకటిస్తామన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆయుధ డిపో నిర్మించాలనే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు ఎం.వైకుంఠరావు, కె.వెంకటేశ్వరరావు, కె.కృష్ణ, డి.వీరబాబు, రంగా, కోర్ల సురేష్ పాల్గొన్నారు.

సీసలి ఘటన దోషులను శిక్షించాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు



మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - కాళ్ల

సీసలిలో ఎస్‌సిలపై దాడి ఘటనలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుపై ఇంతవరకు డిఎస్‌పి దర్యాప్తు చేయకపోవడం పోలీసుల ఏకపక్ష వైఖరికి నిదర్శనమని, తక్షణం జిల్లా ఎస్‌పి, డిఎస్‌పి దర్యాప్తు చేసి చర్యలు తీసుకోకుంటే జిల్లావ్యాప్త ఉద్యమం చేపడతామని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు హెచ్చరించారు. బుధవారం సీసలిలో ఎస్‌సి ప్రాంతంలో పర్యటించిన క్రాంతిబాబు అక్కడి ప్రజలను దాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న సీసలిలో ఎస్‌సి ప్రాంతానికి అనుకుని అంబేద్కర్ విగ్రహం, అంగన్వాడీ కేంద్రం వెనుక ఉన్న 62 అడుగుల స్థలాన్ని దళితులు తమ పూర్వీకుల నుంచి ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అదే స్థలంలో సుమారు కేవలం ఆరు అడుగుల విస్తీర్ణంలో పోలేరమ్మ విగ్రహం ఉండేదని తెలిపారు. ఆ విగ్రహానికి పూజలు చేసుకుంటున్న ఆధిపత్య కులాలకు ఎన్నడూ ఆటంకం కల్గించలేదని చెప్పారు. ఈ మధ్యకాలంలో ఆధిపత్య కులాలకు చెందిన కొంతమంది ఉద్దేశపూర్వకంగా కుల, మత ఘర్షణలకు తావిచ్చేలా ఎస్‌సి ప్రాంతానికి అనుకుని ఉన్న స్థలం పోలేరమ్మ గుడికి చెందినదిగా సృష్టించి సామరస్యంగా ఉన్న ఇరుపక్షాల మధ్య చిచ్చుపెట్టారని మండిపడ్డారు. ఇదే అదును చూసి ఆరడుగుల విగ్రహం స్థానంలో 32 అడుగుల గుడి కట్టడమే కాకుండా మిగిలిన 30 అడుగుల స్థలాన్ని కూడా దళితులకు కాకుండా చేయడమే కాక, ఆ స్థలంలోని అంబేద్కర్ స్మారక ఫ్లెక్సీని ఉద్దేశపూర్వకంగా చింపి, అడ్డుకున్న ఎస్‌సిలపై కిరాయి గూండాలతో హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదై నేటికీ సుమారు 15 రోజులు పూర్తి కావొస్తున్నా నేటి వరకు డిఎస్‌పి దర్యాప్తు చేయకపోవడం అన్యాయమన్నారు. పోలీసుల తీరు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేసేదిలా ఉందన్నారు. వెంటనే జిల్లా ఎస్‌పి ఘటన స్థలంలో పర్యటించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని తక్షణం అరెస్టు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని క్రాంతిబాబు హెచ్చరించారు. కార్యక్రమంలో రాజారత్నం, నాగేశ్వర్ పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో భీమవరంలో

విద్యార్థినుల రాష్ట్రస్థాయి కన్వెన్షన్

హాజరుకానున్న ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షురాలు ఐషే ఘోష్, పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపీమూర్తి

రాష్ట్రవ్యాప్తంగా విచ్చేయనున్న 300 మంది విద్యార్థినులు, విద్యార్థి సంఘ నేతలు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గణేష్, ప్రసాద్ వెల్లడి

ప్రజాశక్తి - భీమవరం

సమాజంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, మహిళా సాధికారత సాధన, వారి అభ్యున్నతి కోసం ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తుందని, దీనిలో భాగంగానే ఎంతో చరిత్ర కలిగిన మన భీమవరంలో ఈ నెల 26, 27 తేదీల్లో రాష్ట్రస్థాయి విద్యార్థినుల కన్వెన్షన్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.గణేష్, టి.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం అంటూ విద్యార్థుల్లో దేశభక్తిని, సామాజిక చైతన్యాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం కృషి చేస్తుందని, దీనిలో ఇప్పటికే 55 వసంతాలు పూర్తి చేసుకుందని తెలిపారు. విద్యార్థినుల కన్వెన్షన్‌కు ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత ఉపాధ్యక్షురాలు, జెఎన్‌యు విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షురాలు ఐషే ఘోష్, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామ్మోహన్, ప్రసన్నకుమార్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పావని హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 300 మంది విద్యార్థినులు, విద్యార్థి నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు, విద్యావేత్తలు, రాజకీయ నాయకులు జయప్రదం చేయాలని కోరారు.



నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ వివాహానికి హాజరైన సిఎం చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేష్

నిమ్మల కుమార్తె వివాహానికి విచ్చేసిన సిఎం, ప్రముఖులు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహ వేడుకకు సిఎం చంద్రబాబు దంపతులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. హెలీకాప్టర్‌లో పాలకొల్లు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేష్‌కు తొలుత మంత్రి నిమ్మల రామానాయుడు సాదరంగా ఆహ్వానం పలికారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఎంఎల్‌ఎలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల అభివృద్ధి బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పీతల సుజాత, మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎం.ఎ.షరీఫ్, ఆర్‌డిఒలు దాసి రాజు, కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహాశీల్దార్ వై.దుర్గాకిషోర్, మున్సిపల్ కమిషనర్ విజయ సారథి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, మాజీ జెడ్‌పి ఛైర్మన్ కొక్కిరిగడ్డ జయరాజు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె, అల్లుడికి చంద్రబాబు దంపతులు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. నిమ్మల కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. అనంతరం హెలికాప్టర్‌లో విజయవాడ బయల్దేరి వెళ్లారు.

డిఎస్‌సి అభ్యర్థులను గాలికొదిలేశారు..!

కనీస ఏర్పాట్లు చేయని అధికారులు

మురికి పట్టిన కార్పెట్లు గతి

గత్యంతరం లేని పరిస్థితుల్లో హోటల్స్‌కు, బంధువుల ఇంటికి అభ్యర్థులు

దిక్కుతోచని స్థితిలో 2,300 మంది



ఏలూరు సెంట్ తెరిసా స్కూల్లో రూమ్‌లో వేసిన కార్పెట్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డిఎస్‌సి అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏలూరుకు తరలించిన అభ్యర్థులను అందరిని గాలికొదిలేసిన పరిస్థితి నెలకొంది. పది స్కూల్స్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించిన అధికారులు అక్కడ కనీస వసతులు ఏర్పాటు చేయని పరిస్థితి నెలకొంది. అభ్యర్థులు, వారి వెంట వచ్చిన వారు ఏం చేయాలో దిక్కుతోచక రాత్రిపూట హోటల్‌కు, బంధువుల ఇళ్లకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌సిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్, జోన్–2 పోస్టులకు సంబంధించి మొత్తం 1146 మంది ఎంపికయ్యారు. వీరందరికీ 25వ తేదీ గురువారం అమరావతిలో సిఎం చేతులమీదుగా నియామక పత్రాలు అందించే ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ఏలూరు వచ్చి రిపోర్ట్ చేయాలని రాత్రికి అధికారులు ఏర్పాటు చేసిన స్కూల్స్‌లోనే ఉండాలని, అన్ని వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం సాయంత్రం ఏలూరు చేరుకున్న అభ్యర్థులకు కేటాయించిన స్కూల్స్ కనీస వసతులు లేకుండాపోయాయి. క్లాస్ రూమ్స్‌లో బెంచీల మధ్యలో మురికిపోయిన కార్పెట్లు వేసి అక్కడే పడుకోవాలని చెప్పిన పరిస్థితి నెలకొంది. దీంతో మహిళా అభ్యర్థులకు ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. పాసులు ఇచ్చేందుకు సైతం తీవ్ర ఇబ్బందులు పెట్టారు. దీంతో మహిళా అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్పెట్లపై ఎలా పడుకోవాలో తెలియక నరకయాతన అనుభవించారు. చాలామంది అందుబాటులో ఉన్న హోటల్స్‌లో రూములు తీసుకుని, మరి కొంతమంది బంధువుల ఇంటికి, కొంతమంది తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. మళ్లీ ఉదయం ఆరు గంటలకు రావాలని చెప్పడంతో నరకయాతన ఏంటన్న ఆవేదన వ్యక్తమైంది. దుప్పట్లు లేక పడుకునేందుకు సరైన చోటు లేక, వసతులు లేక నలిగిపోయిన పరిస్థితి నెలకొంది. ఉద్యోగాలు ఇచ్చి ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు గురి చేస్తుందంటూ తీవ్ర అసహనం డిఎస్‌సి అభ్యర్థుల నుంచి వ్యక్తమైంది.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - నరసాపురం

ఆర్‌టిసి ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌టిసి డిఎం ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ప్రజారవాణా సేవలు, కార్గో సేవలు, కార్గో డెలివరీ, విద్యార్థులకు రాయితీలు, బస్సులకు సంబంధించిన ఇబ్బందులు, విహారయాత్రలకు ప్రత్యేక బస్సులు, సలహాలు, సూచనలు, సిబ్బంది ప్రవర్తన, ప్రత్యేక బస్సులపై ఫిర్యాదులుంటే 9959225486 నెంబర్‌కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు

బంగారంతో పోటీపడుతున్న కొబ్బరి ధర!

గోదావరి జిల్లాల్లో కొబ్బరికి డిమాండ్

లాభాల బాటలో రైతులు

గోదావరి జిల్లాలో కొబ్బరి సాగు..

ప్రజాశక్తి - పాలకొల్లు

బంగారం ధర వలె కొబ్బరికాయ ధర కూడా రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కొబ్బరికి సరైన ధర లేక రైతులు గగ్గోలు పెట్టేవారు. దీంతో పలువురు కొబ్బరి తోటలను నరికి ఆక్వా సాగు చేశారు. ఆక్వా రైతులు కూడా నష్టాల్లో ఉండటంతో ఆక్వా సాగును కొనసాగిస్తున్నారు. అయితే ఇటీవల కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రంలో కొబ్బరి పంటకు తెగుళ్లు వ్యాపించి దిగుబడి తగ్గడంతో గోదావరి జిల్లాల్లో పండే కొబ్బరికాయకు డిమాండ్ పెరిగింది. గత నాలుగు నెలలుగా కొబ్బరి ధర పెరుగుతోంది. కొబ్బరి ధర ఇలా గతంలో ఎప్పుడూ లేదని వ్యాపారులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత కొన్ని సంవత్సరాలుగా కొబ్బరి ధర వెయ్యికి రూ.10 వేలు దాటిన దాఖలాలు చాలా తక్కువ. అయితే నెలరోజుల కింద వరకు రూ.20 వేల వరకు ధర పెరిగింది. ప్రస్తుతం దసరా, దీపావళి పండుగల వల్ల ఉత్తర భారతంలో కొబ్బరికాయకు డిమాండ్ పెరుగుతుంది. పాలకొల్లు మార్కెట్లో వెయ్యి కాయల ధర రూ.27 వేల వరకు ఉంది. దీంతో రైతులు లాభాల పంటలో ఉన్నారు. గోదావరి జిల్లాలో విడిగా కొబ్బరి ధర రూ.35 నుంచి రూ.45 వరకు పెరిగింది. గతంలో కొబ్బరి చట్నీకి బాగా వాడేవారు. హోటల్‌లో కూడా కొబ్బరి చట్నీ ఎక్కువ వేసేవారు. గుడికి వెళ్తే కొబ్బరికాయ కొట్టకుండా ఎవరూ ఉండరు. అయితే ఇప్పుడు ఎక్కువ మంది కొబ్బరికాయ కొట్టకుండా వస్తున్నారు. విడిగా కాయ రూ.40 ఉంది.

కొబ్బరి తోటలను తరచూ సందర్శించాలి

జవ్వాది శ్రీనివాస్, సిఐటియు మండల కార్యదర్శి, పాలకొల్లు

గోదావరి జిల్లాలోని అంబాజీపేటలో కొబ్బరి పరిశోధన కేంద్రం ఉంది. దీనిని పగో జిల్లాలో కూడా ఏర్పాటు చేయాలి. కొబ్బరికి తరచూ నల్లి, తెగుళ్లు రావడంతో కాయ నాణ్యత తగ్గి, దిగుబడి తగ్గి రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొబ్బరి తోటలను తరచూ సందర్శిస్తూ సాంకేతిక సలహా అందించాలి.

కొబ్బరి రైతుకు ప్రభుత్వం ప్రోత్సాహమందించాలి

పి.మురళీకృష్ణ, రైతు, బొబ్బన పల్లి

కొబ్బరి రైతుకు ఎప్పుడు గిట్టుబాటు ధర లేకపోయినా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. కొబ్బరిపై పరిశోధనలు పెరిగి రైతుకు ఉపయోగపడాలి. ప్రభుత్వం గిట్టుబాటు ధర ఉండేలా చూడాలి.

నాణ్యమైన కాయ, దిగుబడి ప్రభుత్వం పెంచాలి



మాటూరి నర్సింహమూర్తి, కొబ్బరి వ్యాపారి, ఉభయ గోదావరి జిల్లాల ఎగుమతి దార్ల సంఘం మాజీ అధ్యక్షులు

గోదావరి జిల్లాల్లో కొబ్బరికాయ నాణ్యత పెరిగి దిగుబడి పెరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇతర రాష్ట్రాల కాయ కన్నా నాణ్యత పెంచేలా కృషిచేయాలి.

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

మంత్రి పయ్యావుల కేశవ్



సముద్రపు గోడ పనులు పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

ప్రజాశక్తి - నరసాపురం

నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యం మెరుగుపర్చుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మండలంలోని పిఎంలంక గ్రామంలోని డిజిటల్ భవనాన్ని బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు ఇస్తున్న శిక్షణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేడు వివిధ రంగాల్లో రాణించిన వారంతా పట్టుదలతో చదివి ఉన్నత స్థితికి చేరుకున్నవారేనన్నారు. సముద్రపు ఒడ్డున్న ఉన్న ఈ గ్రామాభివృద్ధికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతి క్షణం ఆలోచిస్తున్నారన్నారు. త్వరలో ఇక్కడ పిల్లలకు మెరుగైన విద్య కల్పించేందుకు కేంద్ర మంత్రి మహానగరాలకు ధీటుగా క్వాలిటీ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామంలో కోతకు గురవుతున్న సముద్రపు గట్టు, చేపడుతున్న పనులను మంత్రి పరిశీలించారు. బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ పనులను పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి వసంతరావు, తహాశీల్దార్ ఐవివి.సత్యనారాయణ, మైలా వసంతరావు, పేరాల మోహన్, వాతాడి కనకరాజు, శివ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు..!

ఇప్పటికే ఆ కాలేజీలో వరుస ఘటనలు..

ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణంలోని ఒక ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినిపై నాన్ టీచింగ్ సిబ్బంది ఒకరు లైంగిక వేధింపులకు పాల్పడడం కలకలం సృష్టించింది. సదరు ఉద్యోగి వేధింపులను ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారి తల్లిదండ్రులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై యాజమాన్యం ఆ ఉద్యోగిని హెచ్చరించి విద్యార్థిని తల్లిదండ్రులకు సర్దిచెప్పినట్లు తెలుస్తుంది. ఈ కళాశాలలో నెలరోజుల క్రితమే ఒక విద్యార్థిని నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు సమాచారం. కళాశాలలో జరుగుతున్న వరుస ఘటనలపై యాజమాన్యం దృష్టిపెట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉండి రూరల్ బ్యాంకుకు పూర్వ వైభవం..

8 నెలల్లోనే రూ.12 కోట్ల మొండి బకాయిలు వసూలు

ఛైర్మన్ వేగేశ్న సూర్యనారాయణ రాజు

ప్రజాశక్తి - ఉండి

వందేళ్ల చరిత్ర కలిగిన ఉండి రూరల్ బ్యాంకు ప్రతిష్టతను పునరుద్ధరించే దిశగా కీలక అడుగులు వేశామని, బాధ్యతలు స్వీకరించిన అనతికాలంలోనే రూ.15 కోట్ల మొండి బకాయిల్లోంచి రూ. 12 కోట్లను రికవరీ చేశామని బ్యాంక్ ఛైర్మన్ వేగేశ్న సూర్యనారాయణ రాజు తెలిపారు. బుధవారం ఉండి రూరల్ బ్యాంక్‌లో నిర్వహించిన సర్వజన మహాసభ అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఎ, ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు మార్గనిర్దేశంతో బ్యాంకును తిరిగి లాభాల బాట పట్టిస్తున్నామన్నారు. 2000 సంవత్సరం నుంచి 2025 వరకు గత 25 ఏళ్లుగా బ్యాంకుకు రూ.15 కోట్ల మొండి బకాయిలు పేరుకుపోయాయని, ఈ కాలంలో బకాయిదారులకు బ్యాంకు సిబ్బంది, అధికారులు గానీ, పాలకవర్గాలు గానీ ఒక్క నోటీసు కూడా జారీ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. డిపాజిట్ దారులకు భరోసా కల్పించి, బ్యాంకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చే లక్ష్యంతో రఘురామకృష్ణరాజు తనకు ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారని సూర్యనారాయణ రాజు తెలిపారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మొండి బకాయిల వసూళ్లపై దృష్టి సారించామని తెలిపారు. మొత్తం 500 మంది బకాయిదారులలో 450 మంది నుంచి కేవలం స్వల్ప వ్యవధిలోనే రూ.12 కోట్లు వసూలు చేయడం జరిగిందని, త్వరలోనే మిగిలిన మూడు కోట్ల రూపాయల బకాయిలను వసూలు చేసి బ్యాంకులో ఓవర్ డ్యూ లేకుండా చేస్తామన్నారు. బ్యాంకులో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన గంగమోలు ప్రసాద్, దుర్గారావు, బడే కృష్ణ, బెనర్జీలపై 51 ఎంక్వయిరీ వేసి నిజనిర్ధారణ కావడంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి ఆస్తులను జప్తు చేసామన్నారు. దగాపడ్డ బాధితులకు ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు చేతులమీదుగా విజయదశమి అనంతరం రెండు కోట్ల రూపాయలను అందజేస్తామని వివరించారు. ఈ మహాసభలో ఎఎంసి ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, వైస్ ఛైర్మన్ వై.వెంకటేశ్వరరావు, డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, మాజీ ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణరాజు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

29న సిఐటియు మండల మహాసభ

పెనుమంట్ర : సిఐటియు మండల 4వ మహాసభ ఈనెల 29వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు బ్రాహ్మణచెరువు సాయినాథ్ కళ్యాణ్ మండపంలో జరుగుతుందని, జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ బుధవారం ఇక్కడ తెలిపారు. ఈ మహాసభకు మండలంలోని సిఐటియు అనుబంధ సంఘాలైన అంగన్వాడీ, ఆశ, డ్వాక్రా సిఎలు, గ్యాస్ పంపిణీ, కొబ్బరి దింపు, వ్యవసాయ ఫారం కార్మికులు, విద్యుత్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొంటారని ఆయన అన్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం జరిగే ఈ మహాసభకు మార్టేరు, ఆలమూరు, మాముడూరు, పెనుమంట్ర, పొలమూరు ప్రాంతాలకు చెందిన వర్కర్స్ అందరూ తప్పకుండా సమయానికి హాజరు కావలసిందిగా ఆయన కోరారు. అంగనవాడీ వర్కర్స్ మూడు సెక్టార్‌ల నుండి ముగ్గురు టీచర్లు, ఇద్దరు ఆయాలు, ఆశా వర్కర్స్ మూడు పిహెచ్‌సిల నుండి హాజరవ్వాలని పిలుపునిచ్చారు

పెదమల్లం వైసిపి గ్రామ అధ్యక్షులుగా శ్రీను

ఆచంట : కూటమి ప్రభుత్వం చేస్తున్న అవినీతి అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని వైసిపి నాయకులు సుంకర సీతారాం, కోట వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదమల్లం గ్రామంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా బీరా శ్రీనును నియమించినట్లు వైసిపి సీనియర్ నేతలు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, ముత్యాల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పెదమల్లం మాసేనమ్మ ఆలయం వద్ద వైసిపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇరువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంనర కాలంలో ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అవినీతి అరాచకాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పాత్ర పోషించాలని కమిటీ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బోడపాటి పండు, బోడపాటి సూరిబాబు, సూర్నిడి పెద్దిరాజు, ఆదిమూలం ఏసుబాబు, రాజమహేంద్రవరపు శివ, రాపాక చంటి, బీరా మోహన్, నక్కా శ్రీను, సిర్రా శ్రీరామ్, పిప్పరపల్లి రాము, కాపవరపు కృష్ణార్జునరావు, గంటి ఎర్రియ్య పాల్గొన్నారు.

రైతులందరూ ఇ-క్రాప్ చేయించుకోవాలి

మండల వ్యవసాయాధికారి బి.దేవీ స్వరూప

పెనుమంట్ర : వరి సాగు చేసే రైతులందరూ విధిగా ఇ-క్రాప్‌లో పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.దేవీ స్వరూప కోరారు. బుధవారం ఉదయం, సాయంత్రం మండలంలోని వెలగలవారి పాలెం, సోమరాజు ఇల్లిందలపర్రు, మాముడూరు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె, ఎఎఒ ఎన్.సత్యనారాయణ పాల్గొని అవగాహన కల్పించారు. వరి పండించే రైతులు తప్పనిసరిగా పంట నమోదు(ఇ క్రాప్), చేయించుకోవాలని, తద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు చేయుటకు అవకాశం ఉంటుందని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి నిర్ణయించిన కనీస మద్దతు ధరను ధాన్యం గ్రేడ్ ఎ రకముకు క్వింటాల్‌కి రూ.2,389లు, ధాన్యం సాధారణ రకముకు క్వింటాల్‌కి రూ.2,369లు అందుతుందని పేర్కొన్నారు. ధాన్యం తోలే అన్ని వాహనాలకు జిపిఎస్ పరికరమును జత చేయాలని, ధాన్యం సేకరణలో పాల్గొనే వాహనాలకు జిపిఎస్ పరికరమును అమర్చుకోవాలని, ఆ వాహనాలను పిపిసి సెంటర్‌లలో ధాన్యం పోర్టల్ నందు రిజిస్ట్రేషన్ చేయబడాలని రైతులకు సూచించారు. గన్నీ బ్యాగ్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని, కొరత రానివ్వమని తెలిపారు. ఆయా గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆసరాగా ఉచిత వైద్య శిబిరాలు

సీనియర్ నేత గుండాబత్తుల సుబ్బారావు

ఉండి : నిరుపేదలకు ఆసరాగా ఉచిత వైద్య శిబిరాలు దోహదపడతాయని సీనియర్ రాజకీయ నాయకులు గుండాబత్తుల సుబ్బారావు అన్నారు. మంగళవారం ఉండి నియోజకవర్గ యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్, ఎఫ్ఎఫ్‌సిఐ, వినాయక హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యాన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైద్య సదుపాయాలు లేని గ్రామీణ ప్రాంతాల్లో ప్రయివేట్ హాస్పిటల్ వారు ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ శిబిరానికి ఉండి, పరిసర గ్రామాల ప్రజలు వైద్య సేవలను పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి ప్రత్యేక వైద్య సలహాలు, సూచనలు అందించి మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం యునైటెడ్ పాస్టర్స్ యూనియన్, ఎఫ్ఎఫ్‌సిఐ ప్రతినిధులు స్టాన్లీ థామస్, కె.మెల్కి షేదక్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. తమకు సహకారం అందించి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుకు కృషిచేసిన వినాయక హాస్పిటల్ యాజమాన్యానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎలుకల నిర్మూలనను విజయవంతం చేయాలి

ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సురేష్‌బాబు

ఆచంట : రైతులందరూ అధిక దిగుబడులు సాధించేందుకు అధికారుల సూచనలు పాటించాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పల పాటి సురేష్ బాబు అన్నారు. బుధవారం ఆచంట మండలంలోని అన్ని గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఎలుకల మందును పంపిణీ చేశారు. ఆచంట వేమవరం గ్రామంలో జరిగిన ఎలుకల నిర్మూలన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకొల్లు ఎడిఎ పి.మురళీకృష్ణ రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మురళీకృష్ణ మాట్లాడుతూ 96 శాతం నూకలు, 2 శాతం నూనె, 2 శాతం బ్రోమోడయోలిన్ అనే ఎలకల మందు కలిపిన విషపు ఎరను రైతులకు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఉచితంగా పంపిణీ చేసిన ఎలకల మందును రైతులందరూ 10 గ్రాములు పొట్లాలుగా చేసుకుని ఎలుక కన్నాల వద్ద ఉంచాలని తెలిపారు. జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న ఎలుకల మందును రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. సొసైటీ అధ్యక్షులు సత్తిబాబు, ఎంపిటిసి సభ్యులు, టిడిపి కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్

మేనేజర్ గిరిధర్‌కుమార్‌కు వినతిని అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - తణుకు

ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి ఎస్‌ఆర్‌టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తణుకు డిపోలోని కాంట్రాక్ట్ కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిపో మేనేజర్ ఎస్.గిరిధర్ కుమార్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తులసీరామ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికులు సుమారు 25 వేల మంది పనిచేస్తున్నారని, వారికి లేబర్ చట్టాలు అమలు కావడం లేదన్నారు. కార్మికులు సుమారు 44 రకాల పనులను వివిధ రూపాల్లో చేస్తారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి ఇప్పటికే కొన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారం చేశామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు 2011 నుంచి కనీస వేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, అద్దె బస్సు కార్మికులకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన జీతాలు అమలు చేయాలని, డ్రైవర్లకు ఐడెంటి కార్డు ఇవ్వాలని, డ్రైవర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఫ్ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ నాయకులు కె.నూకరాజు, ఎన్.శ్రీనివాసు, టివిఎస్.మూర్తి, కె.రామకృష్ణ, ఆర్‌బి.దుర్గారావు, కామన మునిస్వామి పాల్గొన్నారు.

కార్మిక చట్టాల అమలుకు పోరాడాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ

ప్రజాశక్తి - మొగల్తూరు

200 సంవత్సరాల క్రితం పోరాడి తెచ్చుకున్న కార్మిక చట్టాల అమలుకు తిరిగి పోరాటాలు చేయవలసిన పరిస్థితిలు నెలకొన్నాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో సిఐటియు మండల అధ్యక్షుడు కంచర్ల సత్యనారాయణ మూర్తి(సోనీ) అధ్యక్షతన నిర్వహించిన తొమ్మిదవ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 10 గంటల పని విధానాల జిఒని రద్దుచేసి ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని అన్నారు. ప్రభుత్వం భవననిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. కంచర్ల సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న సొసైటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయవలసిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు జి.పెద్దింట్లు, ఎడ్ల చిట్టిబాబు, కొత్తపల్లి గోవిందరాజు, కడలి ముత్యాలరావు, ఎ.సీతారత్నం, కె.బేబీరాణి, భవననిర్మాణ కార్మికులు, ఐకెపి ఐసిడిఎస్ తదితర సంస్థలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగమణి

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా కార్యదర్శి నాగమణి

ప్రజాశక్తి - భీమవరం

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, జీతాలు వెంటనే విడుదల చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగమణి డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో నాయకులు ఎమ్‌డీ మదీనా అధ్యక్షతన జిల్లా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ గత 23 ఏళ్లు నుండి పనిచేస్తున్న కేవలం రూ.3 వేలు జీతం ఇస్తున్నారన్నారు. అది కూడా గత పదేళ్ల నుంచి పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు ఏళ్ల నుండి మధ్యాహ్నం భోజనంలో అనేక మార్పులు చేశారన్నారు. వంట పెరిగిందని, ఖర్చులు పెరిగాయని, ఖర్చులకు తగ్గట్టు బిల్లులు పెంచలేదన్నారు. బిల్లులు కూడా నాలుగైదు నెలల పాటు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ఐక్యంగా ఆందోళన చేయాలని, సంఘటితం కావాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.అజయ్ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయన్నారు. పిల్లల సంఖ్య తగ్గుతుందని, ప్రభుత్వ విద్యని బలోపేతం చేయాలని, పిల్లలకు వేడిగా వండి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. రాజకీయ, స్థానిక పెద్దలు ఒత్తిడితో అనేక ఇబ్బందులతో మధ్యాహ్న భోజన కార్మికుల పని చేస్తున్నారని, వారి సమస్యల పట్ల, చిరు ఉద్యోగులపై అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని తోడ్పాటు ఇవ్వాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పట్ల ఉదాసీనంగా ఉంటున్నారన్నారు. వంట సామాగ్రి, గ్యాస్ ఉచితంగా ఇవ్వాలన్నారు. వీరందరికీ కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్‌డీ మదీనా అధ్యక్షులుగా, ఎన్.నాగమణి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అక్టోబర్ ఆరో తేదీన జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికై కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించాలని సమావేశం తీర్మానించింది.

పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి

సంఘం అధ్యక్షులు బి.హరికుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెన్షనర్లకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు బి.హరికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం స్థానిక భవనంలో బి.హరికుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు బి.హరికుమార్, సంఘ సలహాదారు వికె.వీరారావు, ఉపాధ్యక్షులు ముత్యాల అర్జునరావు, ఒ.కృష్ణకుమారి, సంఘ కార్యవర్గ సభ్యులు గాజుల మురళీకృష్ణ, దాసం వెంకటరమణ, సిహెచ్.సూర్యప్రకాశరావు, కె.తాతరెడ్డి పెన్షనర్ల సమస్యలపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా పెన్షనర్లకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. తక్షణమే 12వ వేతన సంఘం కమిషనర్‌ను నియమించి ఉద్యోగులకు, పెన్షనర్లకు 30 శాతం ఇంటిరిమ్ రిలీఫ్, తాత్కాలిక భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘ సభ్యులు మాట్లాడుతూ ఇహెచ్‌ఎస్ కార్డుపై వైద్య సేవలు సరిగ్గా అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇహెచ్‌ఎస్ పరిమితిని 2 లక్షల నుండి 5 లక్షలకు పెంచి అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రిలలో వైద్య సేవలు బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్ లో సంఘ భవనం వద్ద పెన్షనర్ల వాహనాలు పెట్టుకోడానికి నిర్మించే షెడ్‌కు అయ్యే ఖర్చు సుమారు రూ.50 వేలు భరిస్తానని సంఘ కార్యవర్గ సభ్యులు గాజుల మురళీకృష్ణ ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో సంఘ కోశాధికారి జనాబ్ ఎమ్‌డి ముస్తఫా, కార్యదర్శి వైవిఎస్.మూర్తి, సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉదయ్‌కు బుంగ మాధవరావు స్మారక చిత్రలేఖన పురస్కారం

మాధవరావు స్మారక చిత్రలేఖన పురస్కారం అందుకుంటున్న ఉదయ్‌కుమార్

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో బుంగ లలితా మాధవరావు స్మారక చిత్రలేఖన పురస్కారం పాలకొల్లుకు చెందిన అంతర్జాతీయ చిత్రకారుడు మార్లపూడి ఉదయ్ కుమార్‌కు అందించారు. అవార్డు కింద రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కెజిఆర్ఎల్ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ దాయన సురేష్ చంద్రజీ మాట్లాడుతూ చిత్రలేఖనంతో పాటు శిల్పకళా రంగంలో కూడా ఉదయ్‌కుమార్ అంతర్జాతీయస్థాయిలో ఉన్నారన్నారు. అమెరికాలో చిత్రావధానం చేసారని, దీంతో పాటు తన చిత్రాల ద్వారా సమాజ చైతన్యానికి కూడా కృషిచేయడం చాలా హర్షణీయమన్నారు. సభాధ్యక్షుడు పోలిశెట్టి శ్రీశ్రీ మాట్లాడుతూ ఈ అవార్డుకి తాము పనిచేస్తున్న రంగంతో పాటు మెరుగైన సమాజానికి కృషి చేసే వారిని పరిగణలో తీసుకుంటామని అన్నారు. పురస్కార గ్రహీత మార్లపూడి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కడో అనేక సన్మానాలు పొందాను గాని సొంత ఊర్లో సొంత మనుషుల మధ్య పొందిన ఈ సత్కారం తన జీవితంలో మర్చిపోలేనిదని, విద్యా చైతన్య సమాఖ్య లాంటి విలువలు కలిగిన సంస్థ ద్వారా ఈ అవార్డు తీసుకోవడం మరింత ఆనందంగా ఉందన్నారు. పురస్కార ప్రధాత బుంగా జెస్సి కళ మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల పేరు మీదుగా ఏదైనా ఒక మంచి పని చేయాలని అనుకున్నారని, ఈ అవార్డు ద్వారా తన కల నెరవేరిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఉపాధ్యాయులు, పాలకొల్లు చిత్రకారుల సంఘాల నాయకులు, చిత్రకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమామహేశ్వరరావు స్వాగతం పలకగా, జవ్వాది నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యా చైతన్య సమాఖ్య కార్యవర్గ సభ్యులు తోలేటి గాంధీ, కింజరపు దుర్గాప్రసాద్, దిరిశాల ప్రసాద్, మంచెం వెంకట కనకరాజు, చేగొండి కరుణకుమార్, వి.కరుణకుమార్ పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, విప్ బొమ్మిడి నాయకర్

మొగల్తూరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన చేస్తుందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, విప్ బొమ్మిడి నాయకర్‌లు అన్నారు. బుధవారం మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసిన బండి ముత్యాలమ్మ అమ్మవారిని, ముత్యాలమ్మ అమ్మవారిని, మైనార్టీ కమిటీ ఛైర్మన్, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్‌లు దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావులు ఆలయ మర్యాదలతో పాలకవర్గ సభ్యులు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి శ్వేత వస్త్రం, ప్రసాదాలను అందించారు. అనంతరం పేరుపాలెం నార్త్ గ్రామంలోని సుమారు 200 సంవత్సరాల క్రితం నాటి ప్రాచీన శివాలయాన్ని రూ.2.25 కోట్ల వ్యయంతో పున్ణనిర్మాణం జరుగుతున్న, పున్ణనిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం పేరుపాలెం బీచ్‌ను సందర్శించారు. అక్కడినుండి నరసాపురం మండలం పిఎం లంక గ్రామంలోని డిజిటల్ భవనాన్ని సందర్శించేందుకు వెళ్లారు. వారి వెంట కూటమి నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

తాడేపల్లిగూడెం : ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలనే ఆశయంతో ది.సిటిజెన్ కోఆపరేటివ్ సొసైటీ ప్రతీ సంవత్సరం ప్రతిభా పురస్కారం అందజేస్తుందని స్థానిక బ్రాంచి మేనేజర్ పి.వినోద్ వర్మ తెలిపారు. బుధవారం స్థానిక బ్రాంచి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీమా ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు గరికపాటి బాపయ్య శర్మ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఈ సంస్థ చేస్తున్న ప్రతిభా పురస్కారాల పంపిణీని కొనియాడారు. ఎపి ట్రాన్స్‌కో విశ్రాంత అధికారి, పివి.సుబ్బరాజు అవార్డు పొందిన విద్యార్థులను అభినందించారు. సంస్థ మాజీ రీజినల్ మేనేజర్ ఎం.నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పిల్లలకు తల్లిపాలు తప్పనిసరి'

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు: మాట్లాడుతున్న ఐసిడిఎస్ పిడి శ్రీలక్ష్మి

ఆరు నెలలు నిండిన పిల్లలకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని ఐసిడిఎస్ పిడి డి.శ్రీలక్ష్మి అన్నారు. శృంగవృక్షం, బంటుమిల్లి ప్రాంతంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద సుపోషిత్ భారత్-సాక్షం భారత్‌లో భాగంగా పోషణ మా యాక్టివిటీ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పిడి శ్రీలక్ష్మీ మాట్లాడుతూ 6 నెలలు నిండిన పిల్లలకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలన్నారు. ఏ వయస్సుకి ఎంత ఆహారం ఇవ్వాలి, ఎన్నిసార్లు ఇవ్వాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. బిడ్డకు తల్లిపాలు ఇస్తే ఏదో అవుతుందనే అపోహలు వీడాలన్నారు. తల్లికి, బిడ్డకు ఎంతో శ్రేష్టకరమనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ వాణి విజయరత్నం, సూపర్‌వైజర్లు పార్వతి, సూర్య కుమారి, అంగన్వాడీలు నాగలక్ష్మి, పుష్ప, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : చంటి బిడ్డలకు తల్లి పాలు ఇవ్వడం మానవద్దని సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ పి.వరలక్ష్మి అన్నారు. బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోషణ మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా నత్తా రామేశ్వరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యత, చిన్న పిల్లలకు ఆహారం తినిపించే పద్ధతులను తల్లులకు వివరించారు. తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా, తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి, బిడ్డకు మంచి అనుబంధం ఏర్పడుతుందని, బిడ్డపుట్టిన అరగంటలోపు తప్పనిసరిగా ముర్రుపాలు తాగించాలని, దానివల్ల బిడ్డల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలకు ఖచ్చితంగా బాలామృతం తినిపించాలని, దానివల్ల పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.వరలక్ష్మితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

నాపై అసత్య ఆరోపణలు తగునా..

వార్డు సభ్యులు పెన్మెత్స రామరాజు

ఉండి : గ్రామాభివృద్ధికి కృషి చేస్తుంటే తనపై కొంతమంది దుష్ప్రచారాలు చేస్తూ అసత్య ఆరోపణలు చేయడం తగదని చినపుల్లేరు గ్రామ సర్పంచి భర్త, వార్డు సభ్యులు పెన్మెత్స రామరాజు అన్నారు. బుధవారం ఉండి మండలం చినపుల్లేరు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ఇంటి సమీపంలోని సుమారు 10 ఇళ్లకు చెందిన యజమానులు మరుగుదొడ్ల వ్యర్థాలను పంట కాలువల్లోకి వదిలేస్తున్నారని మంగళవారం కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తూ ఆందోళన చేసారని అన్నారు. గ్రామంలోని రహదారి ఎత్తు పల్లాలతో ఉండటంతో వర్షాకాలంలో వర్షపు నీరు, వాటర్ ట్యాంక్, ఫిల్టర్ బెడ్లలను శుభ్రం చేసిన నీరు తమ నివాసం వద్ద నుంచి పంట కాలువ వైపు వెళ్తుందని, దీనిని వేరే వైపు మరల్చేందుకు గత ప్రభుత్వ హయాంలోనే తగిన చర్యలు చేపట్టామని, కానీ ప్రభుత్వం మారడంతో అది కార్యరూపం దాల్చలేదని వారు తెలిపారు. అక్టోబర్ 2వ తేదీన జలజీవన్ మిషన్‌లోని మైక్రో ఫిల్టర్‌లను ప్రారంభించడానికి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు వస్తున్నారని, ఆయన దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

డ్రైయినేజీ పరిశీలన..

గ్రామంలోని కొంతమంది డ్రెయినేజీలో మురుగునీరు చేరుతుందని ఫిర్యాదు చేశారని, దానిని పరిశీలించగా ఫిల్టర్ బెడ్లు, వాటర్ ట్యాంక్ శుభ్రం చేసిన నీరు ఆ డ్రెయినేజీ ద్వారా కొంత దూరం వెళ్లి ఆగిపోతుందని, అంతే తప్ప డ్రెయినేజీ ద్వారా పంట కాలవలోకి వెళ్లడం లేదని గ్రామపంచాయతీ కార్యదర్శి మోహిని అన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలించి ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

డాక్టర్ సురేంద్రకుమార్

నరసాపురం : పశువర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలను నియోజకవర్గంలో 27 గ్రామాల్లో పూర్తిచేసినట్లు ఆశాఖ ఎడిఎ డాక్టర్ సురేంద్రకుమార్ తెలిపారు. నరసాపురంలో 9,800, మొగల్తూరులో 9,787 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామన్నారు. ఈనెలాఖరు నాటికి నూరుశాతం పశువులకు టీకాలు వేస్తామన్నారు. కావున పాడి రైతులు ఈ క్యాంపులు నిర్వహించుకోవాలన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఎంపిడిఒ బి.కృష్ణమోహన్

ఆచంట : నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ చట్టం సిబ్బంది, క్షేత్ర సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ప్రయోజనం కలిగే ఈ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కంపోస్టు పిట్స్ నిర్మాణం, నూతనంగా గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కంప్యూటర్ ఆపరేటర్ రాజేష్, టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

సర్పంచి గాతల సుజాత

గణపవరం : స్వస్తి నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న ఉచిత వైద్యశిబిరాల్ని స్థానికులు ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అర్ధవరం గ్రామ సర్పంచి గాతల సుజాత అన్నారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో 232 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు మాట్లాడారు. కూటమి నాయకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

యిందుమూలముగా నా క్లయింటు అయిన తెలంగాణా రాష్ట్రం, మేడ్చల్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి, సప్తగిరి ఎన్‌క్లేవ్, ప్లాట్ నెం.02 రు కాపురస్తులు ఎనిగళ్ల శివరామకృష్ణ ప్రసాద్ గారు వారి తాతగారైన ఎనిగళ్ల మాణిక్యాలరావు గారికి చెందిన క్రయ దస్తావేజు నెం.1004/1954రు దస్తావేజును చేవూరు నుండి గుడివాడ వెళు తున్నప్పుడు మార్గమధ్యములో పోయినది. కావున ఎవరికైననూ సదరు దస్తావేజు దొరికిన యెడల నాకు సమాచారం తెలియపరుచుచూ సదరు దస్తావేజుపై ఏవిధమైన లావాదేవీలు జరిపిన యెడల అట్టి వానిపై సివిల్ క్రిమినల్ చర్యలకు తీసుకొనబడును అనియూ అట్టి లావాదేవీలు చెల్లనేరవని తెలియపరచడమైనది.

జె.రవిబాబు, అడ్వకేట్,
కైకలూరు. సెల్: 6300110571

బహిరంగ వేలం ప్రకటన

మహారాజశ్రీ ప॥గో॥జిల్లా, ఏలూరు మొదటి అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.P.No. 192/2025 (Old E.P.No. 113/2024 in O.S.No. 45/2019

Between:

చిలుకల ధనలక్ష్మి దేవి ...డిక్రీహోల్డర్

మరియు

యర్లపాటి ఇస్సాక్ నిర్మలబాబు ...జడ్జిమెంట్ డెటార్

పై నెంబరు దాఖలా వారంటు గ్రంథములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువ ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారు ది. 13-10-2025 సం॥ తేది ఉదయం గం. 10-30 ని.లకు బహిరంగంగా వేలం వేయుదురు. కావలసిన వారు సదరు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును. వాది/డిక్రీ హోల్డర్ తరపు దాఖలు చేసిన ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్థి వివరము.

పశ్చిమగోదావరి జిల్లా (ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా) అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాఖా, నల్లజర్ల మండలం, దూబచర్ల గ్రామ పంచాయితీలో ఆర్.యస్.నెం. 639/3B లో దక్షిణం వైపు ఉన్న య. 3-17 సెంట్లులో య. 1.58 సెంట్లు RCC బిల్డింగ్‌తో కలిపి జడ్జిమెంట్ డెటరు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో ఉండి ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు చార్జి కాబడి వేలం కావలసియున్న ఆస్తికి హద్దులు:

తూర్పు - Land of Mullapudi Hari Chandra Rao
దక్షిణం - Land of Cherukuri Avatharam and others
పడమర - Devulapalli Road
ఉత్తరం - Land of Ghanta Ankalu and others

అమీనా కిమ్మత్తు : Rs. 35,00,000/-
డిక్రీహోల్డర్ కిమ్మత్తు : Rs. 50,00,000/-

ఇబ్రహిం షరీఫ్
ఏలూరు అడ్వకేట్, ఏలూరు
ది.22-09-2025 సెల్: 92900 49530